సభకు తరలిరండి..

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 12 : నల్లగొండలో జరిగే బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభను విజయవంతం చేస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర నీటి వనరుల గురించి కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు ప్రజలకు తీవ్రనష్టం కలిగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ ప్రజలకు వాస్తవాలను తెలపడానికి నల్లగొండలో ఈ నెల 13న బహిరంగ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. కృష్ణ బేసిన్ ప్రాజెక్టులను కృష్ణ రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తూ కేంద్రం నుంచి తెలంగాణ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు అందరు కలిసి పోరాడుదామని అన్నారు. బహిరంగ సభను ప్రజలు స్వచ్ఛందంగా తరలిరానున్నారని ఆయన కోరారు.

ఘనంగా శ్రీ మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం

మేడ్చల్ కలెక్టరేట్,ఫిబ్రవరి 12: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కేతకీబ్రమరాంభ సమేత శ్రీ మల్లికార్జున స్వా మి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజ ల అనంతరం దాతల సహకారంతో భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

'చలో నల్లగొండ'ను విజయవంతం చేయాలి

సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 : బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం కృష్ణా నదీ జలాల సమస్యపై మంగళవారం నిర్వహిస్తున్న ' చలో నల్లగొండ ' ను కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. చలో నల్లగొండ కార్యక్రమం ఏర్పాట్లు, జన సమీకరణ అంశాల పై ఎమ్మెల్యే సోమవారం సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, మెట్టుగూడ, బౌద్ధనగర్, తార్నాక డివిజన్ల కు సంబంధించి ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పెద్ద సంఖ్యలో కార్యకర్తలను సభకు తరలించాలని సూచించారు. తాము మాత్రమే తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించగలుగుతామన్నారు. కార్పొరేటర్లు శైలజ, సునీత లతో పాటు నాయకులు సుంకు రాంచందర్ సమావేశంలో పాల్గొన్నారు.

నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఇంటర్నల్ పరీక్షలు వాయిదా వేయాలని..

పరిపాలనా భవనం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : పీజీ ఇంటర్నల్ పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు పరిపాలనా భవనం ఎదుట ఆందోళనకు దిగారు. విద్యార్థులు మాట్లాడుతూ.. సిలబస్ పూర్తి కాకముందే పరీక్షలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. యూజీసీ నిబంధనల ప్రకారం నాలుగు నెలల్లో సిలబస్ పూర్తి చేసి పరీక్షలు నిర్వహించాలని గుర్తు చేశారు. దీనికి విరుద్ధంగా వీసీ రవీందర్ సొంత నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న వీసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

మూర్ఛ వ్యాధిపై అవగాహన సదస్సు

అవగాహన సదస్సును ప్రారంభిస్తున్న ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు

బేగంపేట్, ఫిబ్రవరి 12 : మూర్ఛ అనేది మెదడుకు వచ్చే సర్వసాధారణమైన వ్యాధి అని కిమ్స్ న్యూరోసర్జన్ డాక్టర్ మానస్ పాణిగ్రహి అన్నారు. దేశంలో కోటిమందికి పైగా ఈ వ్యాధి బాధితులున్నారని ఆయన తెలిపారు. ' అంతర్జాతీయ మూర్ఛ వ్యాధి దినం ' సందర్భంగా సోమవారం సికింద్రాబాద్ కిమ్స్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు , న్యూరాలజిస్ట్ సర్జన్ సీతాజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. మూర్ఛవ్యాధిపై ఉన్న అపోహలపై వైద్యులు మాట్లాడారు. ఈ వ్యాధిపై ఉన్న దురభిప్రాయాలను పాలద్రోలాలని డాక్టర్ భాస్కర్‌రావు సూచించారు. డాక్టర్ మానస్ పాణిగ్రహి మాట్లాడుతూ.. మూర్ఛ అనేది నరాలకు సంబంధించిన సమస్య ఇది వచ్చినప్పుడు మెదడులోని నాడీ కణాల కార్యకలాపాలు దెబ్బతింటాయని కొన్ని సార్లు స్పృహ కోల్పోతారన్నారు. శస్త్రచికిత్స చేస్తే 80 శాతం మందికి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. చిన్న తనంలో మెదడుకు గాయాలు, అంటువ్యాధులు, తీవ్రమైన గాయాల వల్ల ఇది వచ్చే అవకాశం ఉందన్నారు. జన్యుపరమైన పరిస్థితులు కూడా ఉంటాయని అన్నారు. కొన్ని వేల శస్త్రచికిత్సలు చేసి వ్యాధిని నయం చేసినట్టు తెలిపారు. ఈ వ్యాధి ఉన్న వానికి చిన్న చూపు చూడటం తగదన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

బొల్లారం,ఫిబ్రవరి 12 :కంటోన్మెంట్ ఒకటో వార్డు బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో పురాతన ముత్యాలమ్మ ఆలయాన్ని పునర్నిర్మించారు. సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్, కమిటీ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దుర్గయ్య, వేణు మాధవ్ శర్మ పాల్గొన్నారు.

విద్యరంగంపై ప్రభుత్వం చిన్నచూపు

అలివేలి రాజు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగంపై చిన్నచూపు చూశారని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు మండిపడ్డారు. రూ.2,75,891 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21,383 కోట్లు కేటాయించడాన్ని తప్పుబట్టారు విద్యారంగ అభివృద్ధికి 30 శాతం నిధులు అవసరమైన చోట ప్రభుత్వం కేవలం 7.5 శాతం కేటాయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడం ప్రభుత్వానికి విద్యార్థులపై ఉన్న శ్రద్ధ అర్థమవుతోందని దుయ్యబట్టారు. తగిన నిధులు మంజూరు చేసి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కీసరగుట్టలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

కీసర, ఫిబ్రవరి 12: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామికి గర్భాలయంలో సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. శివభక్తులు కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరేందర్ తెలిపారు.

ప్రజాసేవే పరమావధిగా.. సామాజిక కార్యక్రమాలు

రూ.లక్ష చెక్కును అందజేస్తున్న రఘుకిరణాచార్యులు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 12 : ప్రజాసేవే పరమావధిగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బ్రాహ్మణ సేవా వాహిని రాష్ట్ర అధ్యక్షుడు రఘుకిరణాచార్యులు అన్నారు. హైదరాబాద్, కొండాపూర్ వాసి తటవర్తి శరత్ కూతురు అనారోగ్యంతో బాధపడుతున్నది. ఆపరేషన్‌కు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న బ్రాహ్మణ సేవావాహిని ప్రతినిధులు సోమవారం తుకారాంగేట్‌లోని సంఘం కార్యాలయంలో బాధితురాలి తండ్రికి రూ.లక్ష చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రఘుకిరణాచార్యులు మాట్లాడుతూ.. ఆరేండ్ల పాప పరిస్థితి తెలిసి చలించిపోయామని, చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కన్వీనర్ సుధాకర్ రావు, సభ్యులు రంగానాథ చార్యులు పాల్గొన్నారు.

సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అవకతవకలు

గవర్నర్, యూజీసీ చైర్మన్‌కు రాసిన లేఖలతో ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో జరిగిన అవకతవకలపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో లేఖలు పంపించారు. ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ..అక్రమాలకు పాల్పడి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందిన వారిని వైస్ చాన్సలర్లుగా నియమించకూడదని డిమాండ్ చేశారు. యూజీసీ నిబంధనల ప్రకారం సీనియర్ ప్రొఫెసర్ కావాలంటే ప్రొఫెసర్‌గా 10 పరిశోధనా పత్రాలు సమర్పించి ఉండాలని, వాటిని యూజీసీ కేర్ లిస్ట్, స్కోపస్, వెబాబ్ సైన్స్ వంటి రీసర్చ్ జర్నల్స్‌లో ప్రచురించాలని, ఆ ప్రొఫెసర్ పర్యవేక్షణలో కనీసం ఇద్దరు పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీ పట్టా పొంది ఉండాలని వివరించారు. వాటికి విరుద్ధంగా ఉన్న అన్ని అంశాలను గవర్నర్, యూజీసీ చైర్మన్‌ను కలిసి అన్ని ఆధారాలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు భగత్, అశ్వన్, రాఘవేందర్, మధు పాల్గొన్నారు.

గృహజ్యోతి పథకం లబ్ధిదారుల ఎంపికలో భాగంగా సోమవారం విద్యుత్ శాఖ సిబ్బంది పద్మారావు నగర్ సెక్షన్ పరిధిలోని బోయిగూడ కళారంగ్ కాలనీలో వినియోగదారుల కోసం శిబిరాన్ని నిర్వహించారు. విద్యుత్ బిల్లు, ఆధార్, రేషన్ కార్డు, సెల్ నంబర్ వివరాలను నమోదు చేసుకున్నారు. పద్మారావునగర్ సెక్షన్ ఏఈ సురేశ్, విద్యుత్ లైన్‌మెన్లు నర్సింగ్‌రావు, రవీందర్, ఆసిఫ్, కళారంగ్ బస్తీ కమిటీ అధ్యక్షుడు జావెద్ పాల్గొన్నారు.

– బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 12

సివిల్స్ అకాడమీలో తరగతుల పరిశీలన

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12 : ఉస్మానియా యూనివర్సిటీ సివిల్స్ అకాడమీలో జరుగుతున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను వీసీ ప్రొఫెసర్ రవీందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ రవీందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతీరోజు ప్రధాన దినపత్రికలు చదివి, అంశాలను అర్థం చేసుకోవాలని సూచించారు. పత్రికలు చదవడం అలవాటు లేని వారు అడవిలో ఉన్నట్లుగానే భావించాల్సి ఉంటుందన్నారు. వాట్సప్ లో వస్తున్న విషయాలపై జాగరూకతతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్, ఫ్యాకల్టీ డాక్టర్ బీబీ చారి పాల్గొన్నారు.

న్యూ సరయూ హాస్టల్ మెస్ ప్రారంభం..

మెస్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ రవీందర్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని న్యూ సరయూ (ఈ 2) హాస్టల్ మెస్‌ను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఆహారం నాణ్యత విషయంలో రాజీపడకూడదని, ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, డాక్టర్ పరుశురాం, డాక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

యూరోకిడ్స్ స్కూల్ వార్షికోత్సవం..

పద్మారావునగర్‌లోని యూరో కిడ్స్ స్కూల్ 13వ వార్షికోత్సవం సందర్భంగా చిన్నారుల నాట్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా యూరోకిడ్స్ అకాడమిక్ ఆపరేషన్స్ హెడ్ సైదా సమీర హాజరయ్యారు. చిన్నారులకు గ్రాడ్యూయేషన్ సర్టిఫికెట్లను ఆమె అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ థామస్ ఉదయ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఏస్తర్ విద్యావతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 12

'శ్రీ దూడల యాదన్న గారి యాదిలో ' పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: సర్దార్ సర్వాయి పాపన్న జన్మస్థలమైన జనగామ జిల్లా, ఖిల్లాషాపూర్ గ్రామ సర్పంచ్‌గా 23 ఏండ్లు పనిచేసిన యాదన్న జ్ఞాపకార్థం 'శ్రీ దూడల యాదన్న గారి యాదిలో ' పోస్టర్‌ను ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం ఆవిష్కరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గణేశ్, సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ అర్జున్‌రావు, డాక్టర్ కొండా నాగేశ్వర్, డాక్టర్ చల్లమల్ల వెంకటేశ్వర్లు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ రాజేంద్రనాయక్, ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నల్లగొండ సభను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఫిబ్రవరి 12: కృష్ణాబేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ) కేంద్ర ప్రభుత్వానికి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక వైఖరిని ఖండిస్తూ మంగళవారం నల్లగొండలో జరిగే బహిరంగ సభకు భారీగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు నల్లగొండ సభకు తరలిరావాలని కోరుతూ పోస్టర్లను సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో బీఎల్ఆర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రామారావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

రామాలయ వీధిలో సమస్యల వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 : సీతాఫల్‌మండి డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హేమ అన్నారు. సోమవారం కార్పొరేటర్ డేడ్‌లాక్ బిల్డింగ్ వద్ద జరుగుతున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. చెత్తబండి సరిగ్గా రావట్లేదని స్థానికులు ఫిర్యాదు చేయగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారాసీగూడ మీనాకేఫ్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరగా.. అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీజీఎం కృష్ణ, మేనేజర్ అన్విత్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, రాము, చింటు, చందర్ పాల్గొన్నారు.

స్వాగతం

సికింద్రాబాద్, ఫిబ్రవరి 12 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం వారం రోజులుగా ఢిల్లీలో ఉండి సుప్రీంకోర్టుకు సంబంధించిన ప్రక్రియను దిగ్విజయంగా సమన్వయం చేసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హైదరాబాద్ చేరుకున్నారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్ తిరుగు ప్రయాణంలో భాగంగా సోమవారం రైలు ద్వారా సికింద్రాబాద్‌కు వచ్చారు. రైల్వే స్టేషన్లో నాయకులు డప్పు మల్లికార్జున్ మాదిగ ఆధ్వర్యంలో ఆయనకు హైదరాబాద్ జిల్లా నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో నరసయ్య మాదిగ, నరసింహారావు , సాంసంగ్ మాదిగ, శివప్రసాద్ మాదిగ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో మందకృష్ణ మాదిగకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఓయూలో మెగా రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేశ్ యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 12: తలసేమియా, రక్తహీనతతో బాధపడే వారికోసం ఓయూ విద్యార్థుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరాన్ని టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేశ్ యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వికాస్, శ్రీనివాస్‌యాదవ్, రామచంద్రయాదవ్, లెనిన్, శ్రావణ్, వినోద్, మనోహర్, శంకర్‌యాదవ్, అనిల్ గౌడ్ పాల్గొన్నారు.